


## హుజూరాబాద్ డివిజన్‌లో

# ఇసుక క్వారీలు రద్దు



- ఎనిమిది క్వారీల్లో తవ్వకాలు నిలిపివేస్తూ ప్రభుత్వ ఆదేశాలు
- ప్రజల ఫిర్యాదుకు స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రాష్ట్ర ప్రభుత్వం హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్‌లోని ఎనిమిది ఇసుక క్వారీలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి అనుమతి తీసుకుని పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ మానేరు నదిలో నీటి ఊటలు లేకుండా చేస్తున్నారని ఆరోపిస్తూ ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని మానేరు ఇసుక క్వారీల నుంచి స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనుచరులు పెద్ద ఎత్తున ఇసుకను తోడేస్తూ మానేరు నదిపై ఉన్న మూడు చెక్ డ్యాంలలో నీరు, నీటి ఊటలు లేకుండా చేస్తున్నారని జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు తుమ్మేటి సమ్మిరెడ్డి పది రోజుల క్రితం ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. ఆయా గ్రామాల ప్రజలు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేశారు. స్థానిక ప్రజల విజ్ఞప్తికి స్పందించిన ప్రభుత్వం వెంటనే ఆయా క్వారీల నుంచి ఇసుకను తవ్వడాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్**

ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ ఇసుక తీయడాన్ని సస్పెండ్ చేస్తూ టీఎస్ఎండీసీకి ఆదేశాలు జారీ చేశారు. ఇసుక తవ్వకాలను నిలిపివేయడమే కాకుండా ఆయా క్వారీల స్టాక్ యార్డుల్లో ఇసుక ఎంత నిల్వ ఉన్నది వివరాలు సమర్పించాలని కూడా ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్‌లోని జమ్మికుంట, వీణవంక, మానకొండూర్ మండలం ఊటూరు గ్రామాల మీదుగా మానేరు నది వెళ్తుంది. ఈ పరిధిలో మూడు చెక్ డ్యాంలు కూడా నిర్మించారు. ఈ చెక్‌డ్యాంల కింద ఇసుక మేటలు పేరుకుపోయాయని పేర్కొంటూ టీఎస్ఎండీసీ ఆ ఇసుక మేటలను తొలగించేందుకు క్వారీలకు అనుమతి ఇచ్చింది. జమ్మికుంట మండలం వావిలాల, మానకొండూర్ మండలం ఊటూరు-1, ఊటూరు-2, వీణవంక మండలం చల్లూరు, మల్లారెడ్డిపల్లి, కొండపాక, కోర్కల్, పోతిరెడ్డిపల్లి (కల్లుపల్లి) గ్రామాల్లో ఈ మేరకు ఎనిమిది ఇసుక క్వారీలను ఏర్పాటు చేసి ఇసుకను తవ్వి తీస్తూ అమ్మేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తమ పార్టీకి చెందినవారికి ఈ క్వారీలను అప్పగించి అనుమతి మేరకే కాకుండా అక్రమంగా కూడా ఇసుక తరలిస్తున్నారని గతంలోనూ, ప్రస్తుతం ప్రభుత్వం మారిన తర్వాత ఆరోపణలు వచ్చాయి. ఈ క్వారీల పరిధిలోని కొందరు ప్రజలు క్వారీల తవ్వకం కారణంగా మానేరులో నీటి నిల్వలు లేకుండా పోతున్నాయని, దీంతో రైతులకు, ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కోర్టుకు కూడా వెళ్లారు.

## సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

- రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు

కరీంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మిల్లర్లు వారికి కేటాయించిన రోజువారి సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) లక్ష్యాలను పూర్తి చేయాలని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎస్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వానాకాలం, యాసంగిలో మిల్లర్లు వారికి కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయడానికి కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన దరఖాస్తుల పూర్తి వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, డీసీఎస్‌వో సురేష్, సివిల్ సప్లయిస్ డీఎం రజనీకాంత్ పాల్గొన్నారు.

### జిల్లాలో ఇద్దరికి కరోనా

సుభాష్‌నగర్, జనవరి 8: జిల్లాలో సోమవారం రెండు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి కరోనా పాజిటివ్‌గా తేలిందని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి తెలిపారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి ప్రసవం కోసం వచ్చిన ఒక మహిళకు, జిల్లా ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన మరో మహిళకు కరోనా సోకిందన్నారు. వారిద్దరికీ చికిత్స అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు.



ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేని మూడో రైల్వే లైన్

## రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి

# నిర్మాణం ఎప్పుడు?

- ట్రాక్ దాటుతుండగా ప్రమాదాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

జమ్మికుంట, జనవరి 8: జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌వోబీ) లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడో రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు పూర్తి అయి రెండేళ్లు గడుస్తుంది. ఇప్పటి వరకు రెండు ప్లాట్ ఫారమ్‌లు కలిగి ఉన్న రైల్వే స్టేషన్, నూతన ట్రాక్ నిర్మాణంతో మూడో ప్లాట్ ఫారమ్ కూడా అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం రెండు ప్లాట్ ఫారమ్‌ల మధ్య మాత్రమే ఎఫ్‌వోబీ ఉంది. దాన్ని ఎక్స్‌టెండ్ చేయాల్సి ఉన్నప్పటికి, రైల్వే ఉన్నతాధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదు.

**● ప్రాణాలు గుప్పిట్లో పట్టుకుని ట్రాక్ దాటుతున్న కొత్తపల్లి వాసులు**

జమ్మికుంట-కొత్తపల్లిల మధ్య రైల్వే స్టేషన్ ఉంది. రెండు ప్లాట్ ఫారమ్‌లను కలుపుతూ ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉంది. మూడో రైల్వే లైన్ వేయడంతో ప్రస్తుతం ఉన్న బ్రిడ్జిని ఎక్స్‌టెండ్ చేయకపోవడంతో కొత్తపల్లి ప్రజలు, ప్రయాణీలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ట్రాక్ దాటుతున్నారు. కొత్తపల్లితో పాటు అటువైపు ఉన్న ఇతర గ్రామాల ప్రజలు రైల్వే స్టేషన్‌కు రావాలంటే ట్రాక్ దాటి స్టేషన్ లోనికి రావాల్సి వస్తోంది. లేదంటే మూడు కిలో మీటర్లు తిరిగి రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**● ట్రాక్ దాటుతుండగా ప్రమాదాలు**

కొత్తపల్లి వైపు ఉన్న ఇతర గ్రామాల ప్రజలు రైల్వే స్టేషన్‌కు రావాలంటే ట్రాక్ దాటి లోనికి వస్తుంటారు. ఆర్టీసీ బస్సులు సమయానికి అందుబాటులో లేక పోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి కొత్తపల్లికి చేరుకుంటారు. అక్కడి నుంచి త్వరగా రైల్వే స్టేషన్‌కు చేరుకోవాలనే ఆతృతతో ట్రాక్ దాటుతుంటారు. ఇలాంటి సందర్భాల్లో రైళ్లు ఢీకొని పలువురు మృతి చెందారు. ప్రజాప్రతినిధులు స్పందించి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా కృషి చేయాలని కొత్తపల్లి వాసులు కోరుతున్నారు.



రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న పలు రైళ్లు

# వచ్చే నెల 21 నుంచి సమ్మక్క సారలమ్మ జాతర

- పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలి
- కలెక్టర్ పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు 16 చోట్ల సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహిస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేకుర్తి, కేశవపట్నం, హుజూరాబాద్‌లో పెద్ద ఎత్తున జాతర జరుగు తుందన్నారు. ఏర్పాట్లు పక డ్బందీగా చేయాలన్నారు.జాతరకు చేప ట్టాల్సిన పనులపై కార్యాచరణ రూపొం దించుకుని పనులను ప్రారంభించాలని తెలిపారు. భక్తులకు ఇబ్బం దులు కలగకుండా మంచినీరు, టాయిలెట్, పారిశుద్ధ్యం తదితర అన్ని ఏర్పాట్లను చేపట్టాలన్నారు. క్యూలైన్‌కు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర సమయంలో కెనాల్‌లో స్నానాలకు నీటిని విడుదల చేయాలని, గజ ఈతగాళ్లను నియమించాలని, జాతర ముగిసే వరకు అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, 108 వాహనాలు, మందులు, డాక్టర్లతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులందరు వారి శాఖాపరంగా చేపట్టాల్సిన ఏర్పాట్లను చేసి జాతరను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, జిల్లా ఎక్సైజ్ అబ్కారిశాఖ అధికారి శ్రీనివాసరావు, మిషన్ భగీరథ సీఈ అమరేందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామ్‌కుమార్, అగ్నిమాపకశాఖ అధికారి వెంకన్న, డీఎంహెచ్‌వో లలితాదేవి పాల్గొన్నారు.

**● వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను విజయవంతం చేయాలి**

మానకొండూర్ మండలంలోని కొండపల్కలలో మంగళవారం నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ఏర్పాట్లపై కలెక్టర్ సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఎంపీ బండి సంజయ్, గృహ మంత్రిత్వశాఖ కార్యాలయ డైరెక్టర్ వికసిత్ భారత్ కార్యక్రమ అధికారి దీక్షిత్, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పాల్గొననున్నారని తెలిపారు. ముందుగానే ఏర్పాట్లను సమీక్షించుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రాధాన్యం ఇస్తూ కార్యక్రమం కొనసాగాలని సూచించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీలత, డీఎంహెచ్‌వో లలితాదేవి, ఎల్‌డీఎం ఆంజనేయులు, జడ్పీ సీఈవో పవన్‌కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నరేందర్, డీటీడబ్ల్యూవో జనార్దన్, సీడీపీవో సబిత, మానకొండూర్ ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

- ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా చూసుకోవాలి
- ట్రాన్స్‌కో ఎస్ఈ గంగాధర్



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్‌ఈ గంగాధర్

హుజూరాబాద్, జనవరి 8: యాసంగిలో రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ గంగాధర్ అన్నారు. సోమవారం హుజూరాబాద్‌లో విద్యుత్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే వెంటనే రైతులకు మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను అందించాలన్నారు. విద్యుత్ బకాయిలను సిబ్బంది వసూలు చేయాలన్నారు. మీటర్లు లేకుండా విద్యుత్ వాడుకుంటున్న వినియోగదారులను గుర్తించి వారిపై జరిమానా విధించాలన్నారు. మొండి బకాయిలు ఉంటే వారికి నోటీసులు ఇవ్వాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఈ లక్ష్మారెడ్డి, ఏడీ శ్రీనివాస్, ఏఈలు శ్రీనివాస్, వీరాచారి, సంపత్‌రెడ్డి, రవీందర్, అంజన్న, కుమారస్వామి పాల్గొన్నారు.

## ప్రజావాణికి 184 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ పవేలాసత్పతి

సుభాష్‌నగర్, జనవరి 8: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించని ప్రజావాణికి 184 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జి దారుల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్క రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కరీంనగర్ ఆర్డీవో-19, కరీంనగర్ మున్సిపాలిటీ-16, కరీంనగర్ రూరల్ తహసీల్దార్-11, ఇతర శాఖలకు సంబంధించినవి-138, మొత్తం 184 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్‌వో పవన్‌కుమార్, కరీంనగర్ ఆర్డీవో కె మహేశ్, కలెక్టరేట్ ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

# మహిళలకు 'భరోసా'

- ఆపదలో ఉన్నవారికి 'కేర్ అండ్ ప్రొటెక్షన్'...
- కొత్తపల్లిలో ప్రారంభానికి సిద్ధమైన భవనం

కరీంనగర్ క్రైం, జనవరి 8: మహిళలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యల పరిష్కారం చూపుతూ, వారికి కేర్ అండ్ ప్రొటెక్షన్ కల్పించేందుకు కరీంనగర్‌లో భరోసా కేంద్రాన్ని పోలీసుశాఖ ఏర్పాటు చేసింది. 2022 డిసెంబరు 17న ఈ భరోసా కేంద్రానికి శంకుస్థాపన జరగగా, ఏడాది కాలంలో పూర్తి చేశారు. కరీంనగర్ శివారులోని కొత్తపల్లి వైద్య కళాశాల పక్కన ఈ భరోసా కో ం ద్రా న్ని నిర్మించారు. కోటి 70 లక్షల రూపాయల నిధులతో 13 ఎకరాల స్థలంలో అత్యంత ఆధునిక వసతులతో ఈ భవనం నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో భరోసా కేంద్రం, మొదటి అంతస్తులో షీ టీమ్స్, రెండో అంతస్తులో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ వింగ్ (మానవ అక్రమ రవాణా) విభాగాలు ఉంటాయి. గృహహింస, పోక్సో, సైబర్ వేధింపుల్లో మహిళా బాధితులకు సరైన న్యాయ సహాయం అందించాలనే ధ్యేయంతో ఈ భరోసాకేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర రాజధానితోపాటు కొన్ని పోలీసు కమిషనరేట్లలో ఇప్పటికే సేవలందిస్తూ బాధితుల ప్రశంసలు పొం దుతున్న భరోసా సెంటర్ కరీంనగర్ కమిషనరేట్‌లో ప్రారంభం కానుండడంపై హర్షం వ్యక్తమవుతున్నది.

**● రోజురోజుకు పెరుగుతున్న నేరాలు**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో రోజురోజుకు మహిళలపై నేరాలు అంతకంతకు పెరుగుతున్నాయి. 2022 సంవత్సరంలో మహిళలకు సంబంధించి 498 కేసులు నమోదుకాగా 2023 సంవత్సరంలో 565 కేసులు నమోదయ్యాయి. ఇందులో అత్యాచారాలు, వేధింపులు, పోక్సో కేసులకు సంబంధించిన బాధితుల్లో మహిళలు, యువతులు, బాలికలున్నారు. భరోసా కేంద్రం బాధితులకు అండగా నిలువనుంది



ప్రారంభానికి సిద్ధమైన భరోసా సెంటర్ భవనం

**● ఉద్యోగుల భర్తీకి నోటిఫికేషన్**

మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురైన, ఆపదలో ఉన్న మహిళలకు వైద్య చికిత్సలు, కౌన్సెలింగ్, భద్రత, న్యాయసహాయాన్ని అందించేందుకు ప్రత్యేకంగా జిల్లాకు ఒక భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా కరీంనగర్ శివారులో ఈ భరోసా కేంద్రం ఏర్పాటు చేయగా, ఇందులో పని చేసేందుకు కాంటాక్ట్ ఉద్యోగుల నియామకానికి దరఖాస్తులు కోరుతూ పోలీస్‌కమిషనర్ ఇటీవల నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో నడిచే ఈ భరోసా కేంద్రాన్ని డీఎస్పీ స్థాయి అధికారి నిర్వహిస్తారు. ఈ భరోసా కేంద్రంలో ఒక నిర్వహణాధికారి, ఇద్దరు కౌన్సిలర్లు, రిసెప్షనిస్టు, ఒక ఏఎన్ఎం, లీగల్ అడ్వైజర్ ఉంటారు. వీరంతా బాధితులకు కావాల్సిన అన్ని రకాల సమాచారంతోపాటు సహాయాన్ని అందిస్తారు.

## పొలం వద్ద విద్యుత్ తీగ అమర్చిన వ్యక్తి అరెస్టు

చందుర్తి, జనవరి 8: పొలం వద్ద విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి ఓ వ్యక్తికి తీవ్రగాయాలు కావడానికి కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ కిరణ్ కుమార్ తెలిపారు. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చందుర్తి మండలం రామన్నపేటకు చెందిన బెంద్రపు నరసింహారెడ్డి వర్షిణి దంపతులు గత డిసెంబరు 25న వరినాట్లు వేశారు. వరి సరిపోక పోవడంతో అదే గ్రామానికి చెందిన రైతు తిప్పని రాజయ్యను వరి నారు అడిగారు. సదరు రైతు ఇస్తానని చెప్పడంతో నరసింహారెడ్డి వర్షిణి దంపతులు ఇద్దరూ వరి నారు కోసం రాజయ్య పొలం వద్దకు వెళ్లారు. అక్కడ పొలం చుట్టూ అమర్చిన విద్యుత్ తీగలు నరసింహారెడ్డికి తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కాలుకు గాయం కాగా అక్కడే ఉన్న వర్షిణి పక్క పొలంలో ఉన్న మరో రైతు దేవయ్య వద్దకు పరిగెత్తి జరిగిన విషయం చెప్పింది. వెంటనే దేవయ్య ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై నరసింహారెడ్డి చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రాజయ్యపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై రాజేష్ ఉన్నారు.

## నివాసాల మధ్య వైన్స్ వద్దు

● వ్యాపారి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న వెంగల్‌దాస్ అశోక్

సుభాష్‌నగర్, జనవరి 8: నివాసాలు, వస్త్ర దుకాణాల మధ్యలో వైన్స్ ఏర్పాటు చేయవద్దని కరీంనగర్ కలెక్టరేట్ ఆవరణలో వెంగల్‌దాస్ అశోక్ అనే వ్యాపారి సోమవారం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆయనను పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కరీంనగర్‌లోని గాంధీరోడ్డులో వైన్స్‌ను ఏర్పాటు చేయవద్దని వస్త్ర వ్యాపారులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా గాంధీరోడ్డులో వస్త్ర వ్యాపారం చేస్తున్నామని, వాటి మధ్య వైన్స్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీంతో తాము అక్కడ వ్యాపారాలు నిర్వహించలేమని, మహిళా కస్టమర్లు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. దుకాణాల మధ్య వైన్స్ ఏర్పాటు చేయవద్దని గతంలోనూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. దానికి స్పందించిన కలెక్టర్ సబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వైన్స్ నిర్వాహకులు హైదరాబాద్‌లోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం నుంచి అనుమతి తెచ్చుకుని, షాపు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. దీనిని అడ్డుకోవడంతో వైన్స్‌కు సంబంధించిన వ్యక్తులు తమపై దాడులకు పాల్పడ్డారని వారు ఆరోపించారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో 23 మందికి జైలు శిక్ష




మాట్లాడుతున్న సీఐ ఉపేందర్

సిరిసిల్ల క్రైం, జనవరి 8: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 23 మందికి జైలుశిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ సోమవారం తీర్పు చెప్పారు. సిరిసిల్ల పట్టణ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 23 మందికి ఒక రోజు జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా, ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా, 23 మందికి రూ.3 వేల జరిమానా విధించారు. అనంతరం సిరిసిల్ల పట్టణ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రాజు, ట్రాఫిక్ కానిస్టేబుల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థిని



విద్యార్థినికి ట్రోఫీ అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

చొప్పదండి, జనవరి 8: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు చొప్పదండి జడ్పీ బాలుర పాఠశాల విద్యార్థిని ఎంపికైంది. ఈ నెల 10న రాజస్థాన్‌లోని బిక్నూర్ పట్టణంలో జరిగే ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలకు 9వ తరగతి విద్యార్థిని బుర్ర వైష్ణవి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ కొమురోజు కృష్ణ తెలిపారు. గత నెల 23 నుంచి 25 వరకు నిర్మల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రతిభ కనబరిచింది. బుర్ర వైష్ణవి, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డిని పలువురు అభినందించారు.

## రైస్ మిల్లు నిర్వాహకుడి అరెస్టు

శంకరపట్నం, జనవరి 8: శంకరపట్నం మండలంలోని మొలంగూర్ శివారులో గల పవనసుత ట్రేడర్స్ రైస్ మిల్లు నిర్వాహకుడు ఏనుగుల అనిల్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొలంగూర్ శివారులోని లలిత ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును పవనసుత ట్రేడర్స్ పేరుతో గత కొంత కాలంగా లీజ్‌కు నిర్వహిస్తున్నాడు. ఈ మిల్లుపై సివిల్ సప్లయ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేసి తనిఖీలు నిర్వహించారు. గత సీజన్‌లో ప్రభుత్వం 38,893 క్వింటాళ్ల ధాన్యం మిల్లర్‌కు అందజేసింది. అయితే అనిల్ కేవలం 2,893 క్వింటాళ్ల బియ్యాన్ని సీఎంఆర్ ఇవ్వగా, మిగతా 23,504 క్వింటాళ్ల ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించారు. ఇందుకు 55ఏసీకేల బియ్యం ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంది. దీంతో అధికారులు నిర్వాహకుడికి పలు మార్లు హెచ్చరికలు జారీ చేశారు. గత అక్టోబరులో పంచనామా నిర్వహించి నోటీసులు ఇచ్చారు. అసలు, వడ్డీ, అదనపు వడ్డీతో కలిపి మొత్తం రూ. 7,18,26,515 జరిమానా విధించి, చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. అయినా మిల్లు నిర్వాహకుడు స్పందించకపోవడంతో ఈ నెల 5న సివిల్ సప్లయీ డీఎం రజనీకాంత్ ఫిర్యాదు మేరకు అనిల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్ కుమార్ తెలిపారు.

## భూకబ్జాను అడ్డుకున్న రైతులు

జగిత్యాలరూరల్, జనవరి 8: జగిత్యాల అర్బన్ మండలంలోని హస్నాబాద్ - చల్‌గల్ గ్రామాల మధ్యలో గల శ్రీ వెంకటేశ్వర ఆలయానికి వెళ్లే రహదారి భూమిని కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులను హస్నాబాద్ , చల్‌గల్ గ్రామస్థులు సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పురాతన కాలంనుంచి వెంకటేశ్వర ఆలయ రహదారికి కోసం రైతుల వద్ద నుంచి కొంత భూమిని సేకరించి రహదారి ఏర్పాటు చేసుకున్నామని చల్‌గల్, హస్నాబాద్ రైతులు పేర్కొన్నారు. దీనిని కొంతమంది వ్యక్తులు రహదారిని చెరిపివేసి భూకబ్జాకు పాల్పడుతున్నారని హస్నాబాద్ రైతులు ఆరోపించారు.

ఆలయానికి పురాతనకాలం నుంచి ఉన్న రహదారిని యధావిధిగా కొనసాగించాలని, అలాగే భూకబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో హస్నాబాద్ గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

# సత్యక్కపల్లెలో చిరుతపులుల కలకలం

● భయందోళనలో గ్రామస్థులు



చిరుత పులివిగా అనుమానిస్తున్న గుర్తులు

మెట్‌పల్లి రూరల్, జనవరి 8: మండలంలోని సత్యక్క పల్లె గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో కనిపించిన చిరుతపులి పాదం గుర్తులు సోమవారం కలకలం రేపు తోంది. గ్రామ శివారులోని అటవీ సమీపంలో ఉన్న నీలి చిన్నారెడ్డి అనే రైతు వ్యవసాయ తోటలో చిరుత పులి పాదం గుర్తులుగా భావించి గ్రామస్థులకు సమాచారం అందించాడు. గ్రామంలోని కొందరికి ఇటీవల రెండు రోజుల క్రితం అటవీ ప్రాంతం నుంచి చిరుత తన పిల్లలతో సంచరిస్తూ ఉదయం సమయంలో కనిపించినట్లు, అవి పులులుగా తెలయక ఎవరికి చెప్పలేదని పేర్కొన్నారు. దీంతో గ్రామస్థులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. డీఆర్‌వో మహ్మద్ హఫీజ్‌ద్దిన్, బీట్ అధికారి శిరాజ్ సంఘటనస్థలాన్ని పరిశీలించారు. ఈ గుర్తులు హైన పాదం అడుగులాగా ఉన్నాయని, చిరుత పులులు కాదని పేర్కొన్నారు. ఏ జంతువు అనేది గుర్తించేందకు అటవీ పరిసర ప్రాంతంలో పూర్తి నిఘా పెడుతున్నట్లు మహ్మద్ హఫీజోద్దిన్ తెలిపారు.

## సౌదీ అరేబియాలో చందుర్తి వాసి మృతి



నాగయ్య (ఫైల్)

చందుర్తి, జనవరి 8: చందుర్తికి చెందిన కైర నాగయ్య 55 అనే వ్యక్తి సౌదీ అరేబియాలో మృతి చెందాడు. నాగయ్య జీవనోపాధి కోసం 30 సంవత్సరాల నుంచి గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. 10 సంవత్సరాల క్రితం సౌదీ అరేబియా వెళ్లిన నాగయ్యకు నాలుగు రోజుల క్రితం పక్షవాతం రావడంతో అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం గుండెపోటు రావడంతో ఆస్పత్రిలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య గంగవ్వ 20 సంవత్సరాల క్రితమే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

# భక్తులతో కిక్కిరిసిన వేములవాడ క్షేత్రం



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం



రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, జనవరి 8: దక్షిణాకాశీగా వీరాజిల్లుతున్న రాజన్న క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన సోమవారం కావడంతో భక్తులు, హన్మకొండ, వరంగల్, కరీంనగర్, హుజురాబాద్, హైదరాబాద్, కొరుట్లయ మెట్‌పెల్లి, నిజామాబాద్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు ఆదివారం తరలి వచ్చారు. సోమవారం తెల్లవారు జామున భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించడంతో పాటు ఓం నమఃశివాయ నామస్మరణతో ఆలయ ప్రాంగాణం మారుమోగిపోయింది. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌లో భక్తులు గంటల తరబడి వేచివుండి ఆలయంలోకి ప్రవేశించి శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. కోడెటికేట్ క్యూలైన్‌లో వెళ్లిన భక్తులు శ్రీ స్వామి వారి దర్శనం కోసం నాలుగు గంటలు పట్టినట్లు భక్తులు వాపోయారు. రాజన్నకు కోడెను కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమపూజల్లో పాల్గోన్న భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని తిరుగుప్రయాణమయ్యారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ నేతృత్వంలో ఏఈవోలు, సూపరిండెంట్ అల్లి శంకర్, అశోక్, సిరిగిరి శ్రీరాములు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

# హుజూరాబాద్‌లో సైబర్ మోసం

హుజూరాబాద్, జనవరి 8: హుజూరాబాద్‌లో సైబర్ మోసం జరిగింది. మున్సిపాలిటీలో పనిచేసే వేల్పుల బాబుకు సోమవారం సెల్‌ఫోన్‌కు ఓ లింక్ రావడంతో ఓపెన్ చేశాడు. దీంతో అతని అకౌంట్‌లోని రూ. 18వేలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు మేసేజ్ వచ్చింది. దీంతో హుటాహుటిన బాబు హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నేడు టగ్ ఆఫ్ వార్, టెన్నికాయిట్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 8: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-14, అండర్-17 బాలబాలికల టగ్‌ఆఫ్‌వార్, టెన్నీకాయిట్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్ తెలిపారు. టగ్ ఆఫ్ వార్ ఎంపిక పోటీలను ఉదయం 9 గంటల నుంచి మానకొండూర్ మండలం జడ్పీహెచ్‌ఎస్ చెంజర్ల పాఠశాలలో నిర్వహించనున్నామని తెలిపారు. టెన్నీకాయిట్ ఎంపిక పోటీలను సప్తగిరికాలనీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.



# ఉచితాలు వద్దంటూ ఢిల్లీకి సైకిల్ యాత్ర



కరీంనగర్ నుంచి సైకిల్‌పై ఢిల్లీకి బయల్దేరిన బెల్లపు కరుణాకర్

కరీంనగర్ అర్బన్, జనవరి 8: ఉచితాలు వద్దు.. అంటూ కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన బెల్లపు కరుణాకర్ అనే యువకుడు సైకిల్‌పై ఢిల్లీకి యాత్ర చేపట్టాడు. సోమవారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ నుంచి హైదరాబాద్ ధర్నా చౌక్ మీదుగా దేశ రాజధాని ఢిల్లీ జంతర్‌మంతర్ వరకు సైకిల్‌పై బయల్దేరాడు. 'అనవసరపు ఉచితాలు వద్దు, ప్రామాణిక ప్రభుత్వ విద్య, వైద్యమే ముద్దు' అంటూ సైకిల్‌కు ఒక బోర్డు ఏర్పాటు చేసుకున్నాడు. ప్రభుత్వాలు చేపడుతున్న ఉచిత పథకాలతో సమాజం చిన్నాభిన్నం అవుతుందని నిరసన వ్యక్తం చేస్తూ సైకిల్‌యాత్ర చేపట్టినట్లు కరుణాకర్ తెలిపారు. సైకిల్‌యాత్రలో దారి పొడుగునా ఉచితాలపై నిరసన వ్యక్తం చేస్తూ తన గళాన్ని వినిపించనున్నట్లు ఆయన తెలిపారు. కరుణాకర్ అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి నియోజకవర్గం మొత్తం సైకిల్‌పై తిరుగుతూ ప్రచారం నిర్వహించాడు.

## డిగ్రీ పరీక్షల్లో 14 మంది డీబార్

గణేశ్‌నగర్,జనవరి 8: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం 14 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు.

ఒకటో సెమిస్టర్‌లో వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో-4, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, కరీంన గర్‌లో-1, శ్రీశివాని డిగ్రీ కళాశాల సిరిసిల్లలో-1, మూడో సెమిస్టర్‌లో శ్రీ చైతన్య డిగ్రీ కాలేజ్ కరీంనగర్‌లో 1, అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ కరీంనగర్‌లో-4, ప్రభుత్వం ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ జగిత్యాలలో-2, ప్రభుత్వం డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

## ర్యాష్ డ్రైవింగ్‌కు యువకుడి బలి

పెద్దపల్లి రూరల్ , జనవరి 8: ర్యాష్ డ్రైవింగ్‌తో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పెద్దపల్లి మండలంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన హారిక పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం పరీక్షలు రాసి తన సోదరుడు రాజేష్ (18)తో సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్తుండగా అప్పన్నపేట గ్రామానికి చెందిన ఓ యువకుడు ద్విచక్రవాహనంతో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ హారిక, రాజేష్‌ల ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో హారికతో పాటు ఆమె సోదరుడు రాజేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి వారిని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. రాజేష్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు సూచించగా కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాజేశ్ సోమవారం మృతిచెందాడు. హారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

# అధిక రక్తస్రావంతో బాలింత మృతి

● వైద్యుల నిర్లక్ష్యంతోనే అని బంధువుల ఆందోళన



మృతి చెందిన చెకుట పద్మ



రోధిస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

వేములవాడ టౌన్, జనవరి 8: డెలివరీ కోసం ఆసుపత్రిలో చేరిన గర్భిణీకి పాప జన్మించిన కాసేపటికే అధిక రక్తస్రావం కావడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా మృతి చెందిన సంఘన వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి జీవధార ఆసుపత్రిలో సోమవారం చోటు చేసుకుంది. బాధితురాలు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కోనరావుపేట మండలం నిమ్మపెల్లి గ్రామానికి చెందిన చేకుట పద్మ (30) అనే గర్భిణీ పురిటి నొప్పులతో ఆదివారం నాంపల్లి జీవధార ఆసుపత్రిలో చేరింది. దీంతో పద్మకు సోమవారం ఆపరేషన్ చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కాసేపటికే పద్మకు ఓవర్ బ్లీడింగ్ అవుతోందని కరీంనగర్ తరలించాలని వైద్యులు చెప్పడంతో అక్కడికి తరలిస్తుండగానే మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి చెందిందని కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహాన్ని ఆసుపత్రి వద్దకు తీసుకువచ్చి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ కరుణాకర్‌తో పాటు రూరల్ సీఐలు సంఘటన స్థలానికి చేరుకున్నారు. నిరసన వ్యక్తం చేస్తున్న మృతురాలి బంధువులకు, ఆసుపత్రి యాజమాన్యానికి నచ్చజెప్పి ప్రయత్నం చేసి ఇరువర్గాలను శాంతింపజేశారు. మృతదేహాన్ని అక్కడి నుంచి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. ఈ విషయంపై వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్‌ను వివరణ కోరగా బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని సంఘటనపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### మిన్నంటిన కుటుంబ సభ్యుల రోధనలు

పద్మకు పెళ్లి అయినప్పటి నుంచి పిల్లలు కాలేదని, పది సంవత్సరాల తరువాత గర్భం దాల్చితే ఆడబిడ్డకు జన్మనిచ్చి మృతి చెందిందని కుటుంబ సభ్యులు రోధించిన తీరు అక్కడున్న వారిని కంటతడిపెట్టించాయి. ఎంతో వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిందని బంధులు రోదించడంతో ఆసుపత్రి ప్రాంగణంలో విశాదం అములుకున్నది.

## నివాస గృహానికి రూ.33వేల కరెంటు బిల్లు

గంభీరావుపేట, జనవరి 8: గంభీరావుపేట మండల కేంద్రంలో నెలసరి కరెంటు బిల్లులు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. నెల నెలా క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించే వినియోగదారులకు సైతం వేలల్లో బిల్లులు రావడంతో బెంబేలెత్తుతున్నారు. మండల కేంద్రంలో వరలక్ష్మి అనే మహిళ పేరున ఉన్న విద్యుత్ మీటర్‌పై 33 వేలకు పైగా బిల్లు రావడం చర్చనీయాంశమైంది. అదే విదంగా అనిత పేరు మీద ఉన్న మీటర్‌పై 2 వేలకు పైగా నెలసరి బిల్లు రావడం, ఇలా మామూలు గృహాలకు సైతం వేలల్లో బిల్లులు వస్తున్నాయి.

# కంప్యూటర్ల చోరీపై కొనసాగుతున్న విచారణ

● రంగంలోకి క్లూస్ టీం
● సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ



ఎస్‌ఈ శివకుమార్‌తో మాట్లాడుతున్న ఏసీపీ కరుణాకర్‌రావు

తిమ్మాపూర్, జనవరి8: మండలంలోని మహాత్మానగర్ గ్రామం ఎల్‌ఎండీ కాలనీలో గల ఇరిగేషన్ శాఖ, ఇరిగేషన్ సర్కిల్-2, డివిజన్ నెం-5 కార్యాలయంలో ఆదివారం దొంగతనం జరిగి 4సీపీయులు, 5 మానిటర్లు, రెండు ప్రింటర్లు ఎత్తుకెళ్లిన సంగతి విదితమే. అయితే డివిజన్-5 కార్యాలయంతో పాటుపక్కనే ఉన్న ఇరిగేషన్ శాఖ సర్కిల్-1 కార్యలయంలో కూడా దొంగతనం చేసేందుకు కార్యాలయానికి వేసిన తాళాలను పగల గొట్టినట్లు సోమవారం కార్యలయానికి వచ్చిన సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు.

### చోరీపై అనుమానాలు

ఇరిగేషన్ శాఖ డివిజన్ నెంబరు-5 కార్యలయంలో కంప్యూటర్లు చోరీకి గురి కావడంతో ముఖ్యమైన మానేరు రివర్ ఫ్రంట్, దిగువ మానేరు జలాశయం, ట్యాంకుల ముఖ్యమైన పనుల బిల్లులు, రికార్డులు ఈ కార్యలయంలోనే జరుగుతుండటంతో ఆ డాటా కోసం ఏమైనా దొంగిలించారా, లేదా గుర్తుతెలియని వ్యక్తులు ఈ దొంగతానానికి పాల్పడ్డారా అని పలు కోణాల్లో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

సోమవారం ఉదయం కార్యాలయానికి ఉద్యోగులు వచ్చే సమయానికి క్లూస్ టీం ఇన్‌ఛార్జి శ్రీధర్, తిమ్మాపూర్ సిఐ కర్రె స్వామి, ఎల్‌ఎండి ఎస్సై చేరాలు కలిసి కంప్యూటర్లు దొంగతనం జరిగిన కార్యాలయానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. తనిఖీ చేసి ఆనవాళ్లు, ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. ఎస్‌బి సిఐ సృజన్‌రెడ్డి, ఇంటిలిజెన్స్ సిఐ నరేష్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి వివరాలు సేకరించి, విచారించారు. దొంగతనం జరిగిన కార్యలయంలో ఉన్న ప్రతి ఉద్యోగికి సంబంధించిన వివరాలు సేకరించారు. ఉద్యోగులను ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వారి ఫింగర్ ప్రింట్‌లను సేకరించారు. కార్యాలయ ఉద్యోగులందరినీ ఒక్కొక్కరిగా విచారించారు.

### సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

చోరీ జరిగిన కార్యాలయాన్ని కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్ రావు పరిశీలించారు. కంప్యూటర్లలో ఎలాంటి ముఖ్యమైన సమాచారం ఉందనే దానిపై ఇరిగేషన్ ఎస్ఈ శివకుమార్‌తో పాటు ఇతర అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్లలో ఎలాంటి ముఖ్యమైన డాటా లేదని, ఇతర కార్యాలయల్లో కూడా డాటా అందుబాటులో ఉంటుందని, ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు సమాచారం ఇచ్చారు. డివిజన్-5 కార్యలయ అధికారులు కూడా కేవలం 4సీపీయులు, 5 మానిటర్లు, రెండు ప్రింటర్లు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు, డాక్యుమెంట్లు, ఫైల్స్ దొంగతనానికి గురికాలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### మరో కార్యాలయంలో చోరీకి యత్నం

ఇరిగేషన్ సర్కిల్-1 కార్యాలయం తాళాలు పగల గొట్టేందుకు ప్రయత్నించిన ఆనవాళ్లు కనబడటంతో కార్యలయ ఉద్యోగులను లోనికి వెళ్లనివ్వలేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు, నైట్ వాచ్‌మెన్‌లు లేకపోవడంతో చోరీలు జరుగుతున్నాయని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

## ఛాంపియన్ షిప్ సాధించిన అల్ఫోర్స్ డిగ్రీ విద్యార్థులు



విద్యార్థులతో అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, జనవరి 8: అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు శివశివాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సాధించారు. ఎస్ఎస్ఐఎం-2024 స్టేట్ లెవల్ మేనేజ్‌మెంట్ సమన్వయ్ పోటీలను హైదరాబాద్‌లు నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన అడ్వంచర్స్ బిజినెస్, క్విజ్, ర్యాపిడ్ ఫైర్ తదితర అంశాల్లో ప్రతిభ చాటారన్నారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో పాటు క్యాష్ ప్రైజ్ గెలుచుకున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోళి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి, జిచంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## జాతీయస్థాయి హాకీ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, జనవరి 8: అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలకు చెందిన ఎ.కృతిక్ పటేల్ జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో విద్యార్థిని చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు. హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర హాకీ అసోసియేషన్ వారు నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెదిన కృతిక్‌పటేల్ ఎంపికయ్యారు. రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

## నేడు కరీంనగర్‌లో మధ్యప్రదేశ్ మాజీ సీఎం పర్యటన

భగత్‌నగర్, జనవరి 8: జిల్లాలో మంగళవారం మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ పర్యటన ఉంటుందని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు కరీంనగర్‌లోని వి పార్కులో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మండల అధ్యక్షులు, ఆపై స్థాయి నాయకులతో జరిగే విస్తృత సమావేశంలో పాల్గొంటారన్నారు. అనంతరం మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామంలో సాయంత్రం నాలుగు గంటలకు జరిగే వికసిత్ సంకల్ప్ భారత్ కార్యక్ర మంలో పాల్గొంటారన్నారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు మంగళవారం ఉదయం 10 గంటలకు వేములవాడ రూరల్‌లో జరిగే వికసిత్ సంకల్ప్ భారత్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

## 'తెలంగాణ తల్లి విగ్రహం ఎక్కడ?'

కరీంనగర్ అర్బన్, జనవరి 8: నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉండే తెలంగాణ విగ్రహాన్ని తొలగించారని, విగ్రహం ఎక్కడో ఉందో ఎవరికీ అంతుపట్టడం లేదని మాజీ మేయర్, మాజీ సివిల్‌సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. సోమవారం నగరంలోని తారక హోటల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేసి ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం నగరంలో ఎక్కడ ఉందో తెలియకుండా పోయిందన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆంధ్ర అధికారులు ఎక్కడ దాచిపెట్టారో సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి, మేకల చంద్రశేఖర్ యాదవ్, తివారి, తులా భాస్కర్‌రావు, జయంత్ పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 8: కరీంనగర్ క్రికెట్ క్లబ్, సూఫా క్రికెట్ అకాడమిల ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న యూనిటీ కప్-2024 సీజన్-1 క్రికెట్ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం కరీంనగర్ ఏసీపీ జి నరేందర్ జిల్లా ఒలంపిక్ సంఘ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి సీజన్-1 మెగా ఈవెంట్‌ను భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల విజేతలకు ప్రథమ బహుమతి 72 వేలు, ద్వితీయ బహుమతి 31 వేల రూపాయలను అందించనున్నామన్నారు. ఆసక్తి గల జట్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎ శ్రీనివాస్, కరీంనగర్ క్రికెట్ క్లబ్ కార్యదర్శులు పులమల్ల ప్రసాద్, చీఫ్ కోచ్ సురేష్, నిర్వాహకులు సిద్ధార్థ రెడ్డి, మహర్షిలతోపాటు పలువురు పాల్గొన్నారు.

## దళితబంధు నిధులు విడుదల చేయాలి

హుజూరాబాద్, జనవరి 8: హుజూరాబాద్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న దళితబంధు నిధులను లబ్ధిదారులకు విడుదల చేయాలని రాష్ట్ర మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకంతో దళితుల జీవితాలు మెరుగుపడ్డాయన్నారు. కొంత మందికి దళితబంధు డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు.

## పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి

చొప్పదండి, జనవరి 8: గురుకుల కళాశాలల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సంబోజి శేఖర్, ప్రధాన కార్యదర్శి సానాది వెంకటేష్, కోశాధికారి బూత్కూరి శంకర్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో ఉన్న సాంఘిక సంక్షేమశాఖ గురుకులాల్లో గత ఆగస్టు నెల నుంచి కోడిగుడ్లు, కిరాణం, కూరగాయలు, పండ్లు, మాంసం, సానిటేషన్, స్లీపింగ్ బిల్లులన్నీ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు చల్లటి నీటిలో స్నానంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. విద్యార్థులకు వాటర్ హీటర్ ద్వారా వేడి నీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

## రైతులకు రసీదు ఇవ్వాలి

గంగాధర, జనవరి 8: ఎరువులు, పురుగుల మందు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఏవో రాజు అన్నారు. సోమవారం గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బిల్లు బుక్స్, సాక్ రిజిస్టర్లు, గోదాములను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు ఎరువులు, పురుగుల మందుల శాంపిల్స్ సేకరించి హైదరాబాద్ పరీక్షల నిమిత్తం పంపినట్లు తెలిపారు. దుకాణదారులు నకిలీ ఎరువులు, పురుగుల మందులను అమ్మితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. రైతులు గుర్తింపు పొందిన దుకాణాల వద్దనే కొనుగోలు చేయాలన్నారు.

## దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి చేయాలి : ఆర్డీవో

జమ్మికుంట, జనవరి 8: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని హుజూరాబాద్ ఆర్డీవో సొలిపురం రాజిరెడ్డి అన్నారు. సోమవారం జమ్మికుంట మున్సిపల్, ఎంపిడివో కార్యాలయాలను తనిఖీ చేశారు. వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు ఎంత మేరా ఆన్‌లైన్ జరిగిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ జమ్మికుంట మున్సిపల్ పరిధిలో 11,616, మండల పరిధిలో 12,260 ప్రజా పాలన దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 25శాతం ఆన్‌లైన్ నమోదు అయ్యాయని, 17వ తేది వరకు మొత్తం పూర్తి అవుతుందని తెలిపారు. హుజూరాబాద్ డివిజన్ పరిధిలో ఆన్‌లైన్ ప్రక్రియ వేగంగా జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్వో రజనిరెడ్డి, కమిషనర్ బి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

## రైల్వే కార్మికుల రిలే దీక్షలు

జమ్మికుంట రూరల్, జనవరి 8: నూతన పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు రైల్వే స్టేషన్ ఆవరణలో సోమవారం రైల్వే కార్మికులు రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ పెన్షన్ ప్రతి ప్రభుత్వ ఉద్యోగుడి హక్కు అన్నారు. ముప్పై ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగం చేసిన వ్యక్తి పదవి విరమణ తర్వాత పెన్షన్ లేక పోవడం సరికాదన్నారు. పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ సిహెచ్ శంకర్రావు, డివిజనల్ సెక్రటరీ పి రహీం దర్, బ్రాంచి సెక్రటరీ బచ్చలి శ్రీనివాస్, చైర్మన్ ఉప్పుల రాజయ్య, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# 'అర్హులందరికీ సదరం సర్టిఫికెట్లు అందించాలి'



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న జక్కం సంపత్

సుభాష్‌నగర్, జనవరి8: హుజూరాబాద్ నియోజకవర్గంలో ఆగస్టు2021లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంపు ఫారములు డేటా ఎంట్రీ చేయించి సర్టిఫికెట్లు అందజేయాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు జక్కం సంపత్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 2021 సంవత్సరంలో దివ్యాంగుల కోసం ప్రత్యేక సదరం క్యాంపు ఏర్పాటు చేశారన్నారు. దీనికి 2323మంది హాజరయ్యా రన్నారు. రెండు సంవత్సరాలు గడిచినా ఇంతవరకు దివ్యాంగులకు సదరం ధ్రువీకరణ పత్రాలను అందించలేదని తెలిపారు. ఏప్రిల్ 2022లో హాజరైన వారికి స్లాట్ బుక్ చేసుకొమ్మని చెప్పగా అందులో 850మంది మాత్రమే స్లాట్ బుకింగ్ చేసుకు న్నారన్నారు. మిగిలిన వారు స్లాట్ బుకింగ్ చేసుకోక ముందే స్లాట్ బుకింగ్ ఆపివేశారన్నారు. డిఆర్‌డిఓ, సివిల్ హాస్పిటల్ అధికారుల చుట్టూ రెండు సంవత్సరాలు తిరగగా జనవరి 2023లో కేవలం 312 మందికి మాత్రమే ధృవీకరణ పత్రాలను అందించా రన్నారు. మిగిలిన 2010 మంది దివ్యాంగులు స్లాట్ బుకింగ్ దొరకక చాలా ఇబ్బందులకు గురి అవుతు న్నారని తెలిపారు. ఇప్పటికైనా సదరం ఇన్‌చార్జిపై తగు చర్య తీసుకుంటూ దివ్యాంగుల అసెస్‌మెంట్ ఫారముల వివరాలను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయిం చాలన్నారు. కార్యక్రమంలో వికలాంగుల నాయకులు మంచాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణాలను తొలగించాలి

సుభాష్‌నగర్, జనవరి 8: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను తొలగించి, అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ, అలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలోని ప్రగతినగర్ వాసులమని తెలిపారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినపుడు ఓ సర్వే నంబరులో అభివృద్ధి కోసం కొంత ప్రభుత్వ భూమిని మార్కింగ్ చేసి ఉంచారని తెలిపారు. అదే సర్వేనంబరులో మాజీ సైనికుడి బ్యారకు రెండు ఎకరాల భూమిని ఇచ్చారని తెలిపారు. అయితే ప్రగతినగర్‌కు చెందిన ఓ వ్యక్తి, మాజీ సైనికుడి కుటుంబానికి ఇచ్చిన భూమిని ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని వారి భూమికి సంబంధించిన సర్వే నెంబరుతో అక్రమంగా విక్రయించడమే కాకుండా, అందులో ఆయన ఇంటిని నిర్మించుకున్నాడని ఆరోపించారు. ఈ విషయమై తాము రెవెన్యూ అధికారులకుగా ఫిర్యాదు చేయగా ఆర్ఐ ఆధ్వర్యంలో సర్వే చేసి అట్టి ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. అధికారులు వెంటనే ఆ భూమిని స్వాధీనం చేసుకొని స్థానికులకు ఉపయోగకరంగా ఉండే విధంగా కమ్యూనిటీ హాలు, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల కోసం కేటాయించాలని కోరారు.

## ముగ్గుల పోటీలు

సుభాష్‌నగర్, జనవరి 8: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక సుభాష్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో నైపుణ్యం కలిగిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందచేశారు. క్లబ్ అధ్యక్షుడు నలుమాజు మనోహర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి ప్రభుత్వ పాఠశాలలో ఈ ముగ్గుల పోటీలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో నలుమాచు రాధ, నలుమాజు రాణి, రజిత, అల్లాడి రాధిక, అక్కినపల్లి శివజ్యోతి, క్లబ్‌ప్రధాన కార్యదర్శి పాత హరి ప్రసాద్, కోశాధికారి వేణు, ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.

●కరీంనగర్ కల్చరల్: నగరంలోని మానేరు విద్యాసంస్థల్లో సోమవారం ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు ముందు పాఠశాలలో ముగ్గుల పోటీలను ఘనంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తామన్నారు. అనంతరం బాలికలతోపాటు బాలురు సైతం ముగ్గులు వేసి అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శానిటేషన్ కార్మికుల డివిజన్లు మార్చాలి

కరీంనగర్ అర్బన్, జనవరి 8: కరీంనగర్ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న శానిటేషన్ విభాగపు జవాన్లు, ఇన్‌స్పెక్టర్లు, కార్మికులను ఒక డివిజన్ నుంచి మరొక డివిజన్లకు మార్చాలని దీని ద్వారా పారదర్శకత ఏర్పడుతుందని యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో ఎళ్ల తరబడిగా పాతుకుపోయిన సిబ్బంది గుత్తాధిపత్యాన్ని తగ్గించవచ్చని, దీనివల్ల సానిటరీ వ్యవస్థ మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ అమీర్, మహమ్మద్ ఇమ్రాన్, సిరిపురం నాగరాజు, కలీం తదితరులు పాల్గొన్నారు.

## 'ఫార్మసీ కళాశాల భూములను కాపాడాలి'

కరీంనగర్ అర్బన్, జనవరి8: శాతవాహన యూనివర్సిటీ ఫార్మసీ కాలేజీకి చెందిన భూములను కబ్జాదారుల నుండి కాపాడాలని యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహమ్మద్ అమీర్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఫార్మసీ కళాశాల భూమి అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ మరియు సర్వే ల్యాండ్ అధికారులతో సర్వే చేయించి గోడ నిర్మించాలని కోరారు. కబ్జారాయుళ్ళపై పీడీ యాక్టు నమోదు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్‌రహమాన్‌తో పాటు నాయకులు మహమ్మద్ ఇమ్రాన్, సిరిపురం నాగరాజు, హరీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సురక్షిత బాల్యం కోసం అందరూ కృషి చేయాలి

కరీంనగర్, జనవరి8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పిల్లలపై జరుగుతున్న హింసలను తగ్గిస్తూ వారికి సరైన అవగాహనను కల్పిస్తూ సురక్షిత బాల్యాన్ని అందించడానికి అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో స్నేహిత ఫస్ట్ వన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలపై జరుగుతున్న హింసను తగ్గించి వారికి అన్ని అంశాలపై అవగాహన కల్పించడానికి వివిధ శాఖల అధికారులతో మహిళా శిశు సంక్షేమ, విద్య, వైద్య, డీఆర్‌డీవే, పంచాయతీ, పోలీసుశాఖల వారీగా బృందాలను ఏర్పాటు చేసి 110పాఠశాలల్లోని పిల్లల కొరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, పిల్లలందరు ధైర్యంగా ముందుకు వచ్చి అన్ని విషయాలు చెప్పుకునే విధంగా స్నేహితులుగా ఉండాలన్నారు. వారి భాషల్లో అన్ని విషయాలపై అవగాహన కల్పించాలని, పిల్లలకు ఇబ్బంది ఉన్నప్పుడు ధైర్యంగా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ఉచిత నెంబర్‌కు ఫోన్‌చేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్, సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగం, సెల్ఫ్ ప్రొటెక్షన్, పిల్లల్లో డ్రగ్స్ నివారణ, విద్యా ప్రాముఖ్యత, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మీ, డీడబ్ల్యూవో సరస్వతి, జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు, మార్కెటింగ్ అధికారి పద్మావతి, ప్రోగ్రాం అధికారి డేవిడ్ రాజు, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, డీఆర్‌డీవో శ్రీలత, డీసీపీవో శాంత, సఖి అధికారి లక్ష్మీ, 1098 జిల్లా కో-ఆర్డినేటర్ సంపత్, డీడబ్ల్యూవో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వార్డెన్ల అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలి

### -బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్



మాట్లాడుతున్న రాజేష్‌గౌడ్

గణేశ్‌నగర్, జనవరి 8: జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో వార్డెన్‌ల అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని ఉమ్మడి జిల్లా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు సిరిశెట్టి రాజేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఉన్న వార్డెన్లను ఇతర జిల్లాలకు డిప్యూటేషన్ల పేరిట పంపించి వేరే ప్రాంతాల వారికి అదనపు బాధ్యతలు అప్పగించడం సరికాదన్నారు. సోమవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నతా ధికారులు ఈ చర్యలకు పాల్పడడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతు న్నారని తెలిపారు. దీనిపై వెంటనే సంబంధిత అధికారులు స్పందించి విచారణ జరిపించి కరీంనగర్ నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన వార్డెన్లను తిరిగి కరీంనగర్‌కు రప్పించాలన్నారు. అదనపు బాధ్య తలు నిర్వహిస్తున్న వార్డెన్లను తొలగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో ఈనెల 10న బీసీ సంక్షేమ కార్యాలయం ముందు బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంగల నాయకులు వేంకటేశ్, సుమాన్, మహేశ్, నరేశ్ పాల్గొన్నారు.

# తెలంగాణ గళం వినిపించాలంటే బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలి



శంకరపట్నంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

శంకరపట్నం, జనవరి 8: తెలంగాణ గళం పార్లమెంట్‌లో వినిపించాలంటే బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం శంకరపట్నంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణరావులతో కలిసి బీఆర్ఎస్ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు అన్ని అమలు చేయకుంటే తెలంగాణ ప్రజలు రోడ్లెక్కే పరిస్థితి వస్తుందన్నారు. ఈ సారి పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా తప్పకుండా ఎగరాలని, బీఆర్ఎస్ కార్యకర్తలందరూ సైనికులా పనిచేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి జరగాలన్న, ప్రజలకు మంచి జరగాలన్న, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీల గొంతు వినబడాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంట మహిపాల్‌రెడ్డి, నాయకులు సతీష్‌రెడ్డి, సంజీవరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

చొప్పదండి: చొప్పదండిలోని శ్రీ వేంకటేశ్వర మణికంఠ ఆలయంలో మహా పడిపూజ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా మహా పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించగా అయ్యప్ప స్వామికి ఫల పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాపడిపూజ మహోత్సవంలో ఆలయ చైర్మన్ బొడిగె వెంకటేశ్ గౌడ్, ఎంపీపీ చిలుక రవీందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, చీకట్ల రాజశేఖర్, కొత్త గంగారెడ్డి, చరణ్, చేపూరి సత్యనారాయణగౌడ్, గొల్లపల్లి శ్రావణ్ కుమార్, బొడిగె వెంకన్న, సింహాచలం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ

రామడుగు, జనవరి 8: మండలంలో ప్రజాపాలన గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. 23 గ్రామాల్లో 15,076 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి గ్రామాల్లోని సిబ్బంది బిజీగా ఉన్నారు. గోపాల్‌రావుపేటలో దరఖాస్తుల నమోదును సర్పంచ్ కర్ర సత్యప్రసన్న పరిశీలించారు.

### శబరిమలైకి అయ్యప్ప స్వాములు

వీణవంక జనవరి 8: మండలంలలోని నర్సింగాపూర్ గ్రామంలో 41 రోజుల దీక్ష అనంతరం ఉమామహేశ్వర ఆలయంలో అయ్యప్ప స్వాములకు గురుస్వాములు ఇరుముడిలు కట్టారు. అనంతరం ప్రత్యేక వాహనంలో స్వాములు శబరిమలైకు బయలుదేరి వెళ్లారు. గురుస్వాములు ఉయ్యాల చంద్రమౌళి, గంగాడి ప్రకాశ్‌రెడ్డి, రామగిరి సంపత్,బుర్ర సాయి, రాజిరెడ్డి, అశోక్, రవి, కోమల్‌రెడ్డి పాల్గొన్నారు.

## పల్లె ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు



పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

ఇల్లందకుంట, జనవరి 8: ఇల్లందకుంట మం డలంలోని సిరిసేడు, బోగంపాడు గ్రామాలకు చెందిన పల్లె ప్రకృతి వనాన్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. ఇల్లంద కుంట మండల కేంద్రంలోని ఎర్రగుట్ట సమీపం లో ఎకరం భూమిని బోగంపాడు, సిరిసేడు గ్రామాలకు నాలుగేళ్ల క్రితం అధికారులు పల్లె ప్రకృతివనం కోసం అప్పగించారు. సంబంధిత అధికారులు, గ్రామసర్పంచ్‌లు ఆ స్థలంలో సుమారు 2వేల మొక్కలు పెంచుతున్నారు. వాటి ఖర్చు రూ. 4లక్షల వరకు ఉంటుంది. కానీ అట్టి భూమిలో మొరం తీసేందుకు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ప్రకృతి వనాన్ని రాత్రికి రాత్రే ధ్వంసం చేసి ఉంటారని చర్చించుకుం టున్నారు. సోమవారం ఉదయం అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వ ఆస్థిని నష్టపరిచిన వ్యక్తులపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో శంకర్, పంచాయతీ కార్యదర్శి అంకూస్ తెలిపారు.

## షాదీఖానా నిర్మాణం పూర్తయ్యేనా?



మానకొండూర్‌లో బేస్‌మెంట్‌కు పరిమితమైన షాదీఖానా

మానకొండూర్, జనవరి 8: మానకొండూర్‌లో ఆరేళ్లుగా ముస్లిం షాదీఖానా బేస్మెంట్‌కే పరిమితమైంది. మండల కేంద్రంలోని చెరువు కట్ట కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి పక్కన ఉన్న తన స్వంత భూమి ఎకరం 20 గుంటల స్థలాన్ని అదే గ్రామానికి చెందిన మహ్మద్ బాషమియా షాదీఖానా నిర్మాణానికి విరాళంగా ఇచ్చాడు. దీని నిర్మాణానికి కోటి రూపాయలను రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసింది. 12 ఏప్రిల్ 2018న ఈ స్థలంలో అప్పటి పార్లమెంట్ సభ్యులు బోయినిపల్లి వినోద్‌కుమార్, అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ షాదీఖానా నిర్మాణానికి భూమిపూజ చేయగా బెస్‌మెంట్ వరకు నిర్మించి వదిలేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించి షాదీఖానా నిర్మాణం పూర్తి చేయాలని ముస్లింలు కోరుతున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జనవరి 8: నగరంలో విద్యుత్ 33 కెవి వెంకటసాయి ఫీడర్‌లో పరిధిలో కొత్తగా 33 టవర్ల పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నగరంలో వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ సాయినేని నరేందర్ తెలిపారు. లక్ష్మీనగర్ వంటి ప్రభావిత ప్రాంతాలు విఎస్ఎల్ కాంప్లెక్స్, వాసవికాలనీ, రాఘవేంద్ర నగర్, వందన అపార్ట్‌మెంట్స్, స్కాలర్స్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

## సోషల్ మీడియాలో తప్పుడు వార్తలపై ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, జనవరి8: రెండు సంవత్సరాల కిందట బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై దిష్టిబొమ్మ దహనం చేసిన ఫొటోను సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసినట్లు తప్పుడు వార్తను సోషల్ మీడియాలో వేటు న్యూస్ పేరు మీద పోస్టు చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టౌన్ ఏసీపీ, రెండో ఠాణాలో ఫిర్యాదు చేశారు. వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగే విధంగా పోస్టు చేసిన వారిని వెంటనే గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి సమద్ నవాబ్, నాయకులు శ్రవణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్,కమ్రొద్దీన్, ముక్క భాస్కర్, షేక్ శేహెన్ష, అష్రఫ్, దండి రవీందర్, పోరండ్ల రమేష్, షబానా మహమ్మద్, హనీఫ్ తదితరులు ఉన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ

కరీంనగర్ అర్బన్, జనవరి8: నగరంలోని మంకమ్మతోటకు చెందిన సుఫి స్వచ్ఛంద సంస్థ ద్వారా నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి చేతుల మీదుగా సోమవారం పదిహేను పేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రియాసత్ అలీ, మహమ్మద్ అక్బర్, సాజిద్, ఖదీర్, నయీం, మున్న, ఎక్బాల్, ఎండి గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో పోటీ చేసే అవకాశం కల్పించాలి

కరీంనగర్ రూరల్, జనవరి 8: పెద్దపల్లి పార్లమెంట్ స్థానంలో పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ బీజేపీ రాష్ట్రఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి దరఖాస్తు అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి బన్సల్‌ను కలిసి దరఖాస్తు అందజేశారు. ఈకార్యక్ర మంలో పశ్చిమ జోన్ ఓబిసి కార్యదర్శి చంద్రగిరి వేణు, నేతకాని సంఘం రాష్ట్ర నాయకులు కె లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ మహాసభ పార్లమెంట్ ఇన్‌చార్జిగా అంజయ్య

సుభాష్‌నగర్, జనవరి 8: ముదిరాజ్ మహాసభ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీగా నిమ్మల అంజయ్యను నియమించినట్లు ముదిరాజ్ మహాసభ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గంగాధర కనకయ్య తెలిపారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ మహాసభ బలోపేతం కోసం అంజయ్యను నియమించినట్లు తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా క్రాంతి

మానకొండూర్, జనవరి 8 : మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన ఆరెపల్లి క్రాంతిని ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు నియోజకవర్గ అధ్యక్షులు తుంగ ఆంజనేయులు సోమవారం తెలిపారు. తన నియమకానికి సహకరించిన జిల్లా స్థాయి నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గంగాధర, జనవరి 8: అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండ ల ప్రధాన కార్యదర్శి రేండ్ల శ్రీనివాస్ అన్నారు. సోమ వారం గంగాధరలో జరిగిన వికసత్ భారత్‌యాత్ర అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వికసత్ యాత్రలో అన్ని శాఖల అధికారు లు పాల్గొని అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడా లని అన్నారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

సైదాపూర్, జనవరి 8: మండలంలోని ఆకునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ ఉచిత స్టడీ మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయుడు బొట్ల రామస్వామి పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి 10జీపీఏ సాధించాలన్నారు. కార్యక్ర మంలో ఉపధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.

## రూ.6,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 8: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6800 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 64మంది రైతులు 812క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు 15క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6800, కనిష్ఠ ధర రూ.5800 చెల్లించి పత్తి కొనుగోళ్ల చేపట్టారు.

## అయ్యప్ప ఆలయానికి విరాళం

చొప్పదండి, జనవరి 8: చొప్పదండిలోని అయ్యప్ప ఆలయ అభివృద్ధికి ఎన్నారై డాక్టర్ సామల మల్లికార్జున్, అర్చన దంపతులు 25 వేల 116 రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని మల్లికార్జున్ తన తల్లి సామల అమృతమ్మ, సోదరులు సామల నాగరాజు, సామల తిరుపతిల చేతులమీదుగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్‌కు అందజేశారు.

## ● సంక్షిప్త సమాచారం..

●వీణవంక: గంగారం గ్రామానికి చెందిన విద్యార్థిని కరీంనగర్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి శనివారం వెళ్లిందని రెండు రోజులుగా ఇంటికి తిరిగిరాక పోవడంతో ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

●భగత్‌నగర్: ఉమ్మడి పది జిల్లాల ప్రాతిపదికన జోనల్ వ్యవస్థను పునర్ వ్యవస్థీకరణ చేయాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, ముఖ్య సమన్వయకర్త మహ్మద్ ఫయాజ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 33జిల్లాల విభజనపై జ్యూడిషియరీ కమిటీ వేస్తామని సీఎం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నాగేందర్‌సింగ్, విజయబాస్కర్, రామ్‌దామోదర్‌రావు, తిరుపతాచారి, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

●భగత్‌నగర్: మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌కు బంధుప్రీతి లేకుంటే సునీల్‌రావు మేయర్ ఎలా అయ్యాడని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్ ప్రశ్నించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపించారు.

●సైదాపూర్: మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక హుజూరాబాద్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలోఆచార్య ప్రబోధానంద యోగీశ్వర గురువు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. అనంతరం సంక్రాంతి విశిష్టను వివరించారు.